
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 9 జూన్ 2024



పత్రికా రంగంలో ప్రముఖ పాత్ర పోషించి, ఎంతో మందికి ఉపాధి కల్పించిన 'ఈనాడు' అధినేత రామోజీరావుకు జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఘననివాళులర్పించారు. తెలుగుదేశం, ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఇక టీడీపీ ముఖ్యనాయకులు రామోజీరావుతో ఉన్న సన్నిహిత సంబంధాలను నెమరు వేసుకున్నారు. వారి అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

- నెల్లూరు (హరనాథపురం)

అక్షర యోధుడికి అశ్రునివాళి!

- జిల్లావ్యాప్తంగా శ్రద్ధాంజలి ఘటించిన ముఖ్యులు



కోవూరులో ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టుల నివాళులు

తెలుగుజాతికి తీరని లోటు

ఉన్నత విలువలతో, ఉత్తమ ప్రమాణాలతో పత్రికా రంగంలో అనేక సంస్కరణలు తెచ్చిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం తెలుగుజాతికి తీరని లోటు. రామోజీ విలువలకు పెద్దపీట వేస్తూ అనేక రంగా ల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. రామోజీ ఫిల్మ్‌సిటీ, మార్గదర్శి, ప్రియ, ఈనాడు, ఈటీవీ వంటి సంస్థల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించారు. తుఫాను, కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు, కరోనా సమయంలో ఈనాడు సంస్థల తరఫున ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిచి పోతాయి. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాము.

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు

మహోన్నత వ్యక్తి

వ్యాపార, పత్రికా రంగాల్లో ప్రముఖ పాత్ర పోషించి, లక్షలాది మందికి ఉపాధి కల్పించిన మంచి మనసున్న మహోన్నత వ్యక్తి. పత్రికా రంగంలో మకుటం లేని మహారాజుగా రామోజీ రావు గుర్తింపు పొందారు. ఆయన మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా.

- పొంగూరు నారాయణ, నెల్లూరు నగర ఎమ్మెల్యే

సారా వ్యతిరేక ఉద్యమాన్ని పతాక స్థాయికి..

1991లో నెల్లూరులో పుట్టిన సారా వ్యతిరేక ఉద్యమాన్ని పతాక స్థాయికి రామోజీరావు తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆ ఉద్యమం విజయవంతం కావడాన్ని బాధ్యతగా భావించారు. సారా వ్యతిరేక ఉద్యమ అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించిన నన్ను ప్రోత్సాహించి రాష్ట్రస్థాయి గుర్తింపు ఇచ్చారు. ఎన్టీఆర్ సభ పెట్టి సంపూర్ణ మద్యపాన నిషేధం హామీ ఇవ్వడం, ఆ వెంటనే అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సారాను నిషేధించటం జరిగింది. ఈ విషయాల్లో ఈనాడు రామోజీరావు పాత్ర కీలకం. ఆయన మరణం తెలుగు ప్రజలందరికీ తీరని లోటు. రాష్ట్రం ఒక పెద్ద దిక్కును కోల్పోయింది. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ఆయనో అక్షర శిఖరం

క్రమ శిక్షణ, పట్టుదల, శ్రమించేతత్వం రామోజీరావు ఆభరణాలు. ఆయన జీవితం నేటితరానికి ఆదర్శనీయం, ఆచరణీయం. ఆయన ఒక అక్షర శిఖరం. బుల్లి తెర, సినీ రంగం, పర్యాటకం, ఆతిథ్యం, జర్నలిజం ఇలా ఎంచుకున్న రంగం ఏదైనా రామోజీరావు తనదైన ముద్రవేశారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం. రామోజీరావు మనల్ని వీడారన్న వార్త బాధిస్తోంది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి.

- బీద రవిచంద్ర, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

అవిశ్రాంత శ్రామికుడు

సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన రామోజీరావు స్వయంకృషితో ఎదిగి తన సంస్థల ద్వారా లక్షలాదిమందికి ఉపాధి కల్పించారు. ఆయన అవిశ్రాంత శ్రామికుడు. పత్రికా రంగానికి ఎనలేని సేవచేశారు. ఆయన జీవితం ప్రస్తుత, భవిష్యత్తు తరాలకు ఆదర్శం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా.

- మందా బాజ్జి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

తెలుగు వెలుగు రామోజీరావు

రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి. ఆయన మరణం రాష్ట్రానికే కాదు. దేశప్రజలకు తీరని లోటు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం. రామోజీ అస్తమయంపై ఆయన కుటుంబసభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.

- గంజాం రాఘవేంద్ర, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి

ఆ చాన్స్ ఎవరికో!?

రాష్ట్ర క్యాబినెట్‌లో నారాయణ పేరు?

మరొకరికి కూడా దక్కే అవకాశం


రేసులో సోమిరెడ్డి, ఆనం, కోటంరెడ్డి, ప్రశాంతి పేర్లు


అమాత్య పదవి రేసులో జిల్లా నేతలు

కేంద్రమంత్రి వర్గంలో వీపీఆర్‌కు అవకాశం?

కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గంలో చోటు ఎవరికి దక్కుతుందో.. ఆ అదృష్టవంతులో ఎవరోనన్న చర్చ జిల్లాలో విస్తృతంగా నడుస్తోంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఎన్డీఏ కూటమి నెల్లూరు పార్లమెంటు సహా పది అసెంబ్లీ స్థానాలనూ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి వర్గాల్లో జిల్లాకు సముచిత స్థానం దక్కే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ రాష్ట్ర క్యాబినెట్‌లో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈయనతోపాటు జిల్లా నుంచి మరొకరికి అవకాశం దక్కనుంది. ఇక ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ చేరనున్న క్రమంలో తెలుగుదేశం కోటా కింద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కుతుందనే ప్రచారం విస్తృతంగా నడుస్తోంది.





- రాష్ట్ర క్యాబినెట్‌లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ పేరు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీలో, విజయంలో నారాయణ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ క్రమంలోనే క్యాబినెట్ జాబితా చంద్రబాబు ప్రకటించకముందే నారాయణ పేరు ప్రచారంలోకి వచ్చేసింది. అయితే, మంత్రి వర్గంలో ఏ శాఖ ఇస్తారనేదే క్లారిటీ లేదు. గతంలో చేసిన రెండు శాఖలు (సీఆర్‌డీఏ, మున్సిపల్ శాఖ) చేస్తారా!? లేదా కొత్త శాఖలు కేటాయిస్తారా అనేది అధినేత అభిమతం మేరకే ఉంటుంది.
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఓడించారు. పూర్వం మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి. ఈ క్వాలిటీల మేరకు సోమిరెడ్డికి అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనికితోడు సర్వేపల్లి నియోజకవర్గం తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఉంది. ఈయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఇటు నెల్లూరు, అటు తిరుపతి జిల్లాలను కవర్ చేసినట్లు అవుతుంది. కాబట్టి ఈయనకు చాన్స్ దొరికే అవకాశం ఉందని అనుకొంటున్నారు.
- ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి అందరికన్నా సీనియర్ నాయకుడు. ఇప్పటికే పలు శాఖల మంత్రిత్వాన్ని సమర్థవంతంగా నెరిపిన అనుభవజ్ఞుడు. ఎన్నికలకు ముందే వైసీపీని ధిక్కరించి టీడీపీలో చేరారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆత్మకూరులో పోటీ చేశారు. వైసీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గంలో టీడీపీని గెలిపించి చూపించారు. ఈ క్వాలిటీల నేపథ్యంలో ఆనంకు మంత్రి పదవి దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది.
- ఈ ఎన్నికలతో జిల్లాలో హ్యాట్రిక్ సాధించిన ఏకైక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన తొలి వైసీపీ ఎమ్మెల్యే కూడా. ఈయన తిరుగుబాటుతో రాష్ట్రవ్యాప్తంగా జగన్‌ను ప్రశ్నించే ధైర్యం వచ్చింది. రాజకీయ చతురిడిగా పేరున్న ఆదాల ప్రభాకరరెడ్డిని చిత్తుగా ఓడించి ప్రజల్లో తనకున్న సత్తా నిరూపించుకున్నారు. అన్నింటికి మించి నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితంగా మెలుగుతున్నారు. ఈ క్వాలిటీస్ ఈయనకు మంత్రి వర్గంలో చోటు సంపాదించి పెడుతాయనే ప్రచారం ఉంది.
- కోవూరు బలమైన రాజకీయ కుటుంబానికి చెందిన సీనియర్ నాయకుడ్ని భారీ ఓట్ల తేడాతో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓడించారు. ఎన్నికల ప్రసంగాలు, పోల్‌మేనేజ్‌మెంట్‌ల ద్వారా తనకున్న నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నారు. ఇవన్నీ ప్రశాంతి రెడ్డికి ఉన్న ప్లస్ పాయింట్లు కాగా మహిళ కావడం మరో పెద్ద ప్లస్ పాయింట్. మహిళా కోటా కింద ఈమెకు మంత్రి వర్గంలో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అయితే కేంద్ర మంత్రి వర్గంలో వీపీఆర్‌కు అవకాశం దక్కితే రాష్ట్ర క్యాబినెట్‌లో ఈమెకు అవకాశం దక్కడం కష్టం.
- కేంద్ర క్యాబినెట్‌లోకి వీపీఆర్!? ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం చాలా కీలకంగా మారింది. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం, కేంద్ర నిధులు, పథకాలు, విభజన హామీలు నెరవేర్చుకోవడం కోసం ఎన్డీయే ప్రభుత్వంలో చేరాలని తెలుగుదేశం నిర్ణయించుకుంది. ఈ క్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి టీడీపీ తరఫున కేంద్ర క్యాబినెట్‌లో అవకాశం దక్కుతుందనే ప్రచారం జిల్లాలో జోరుగా ఉంది. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పట్ల చంద్రబాబుకు ఉన్న ప్రత్యేక అభిమానం ఉందనే విషయం ఇది వరకే రుజువయ్యింది. జిల్లాలో వీపీఆర్‌కు ఉన్న బలాన్ని ఎన్నికల ప్రచారం సందర్భంగా గమనించిన చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర క్యాబినెట్‌లో వీపీఆర్‌కు అవకాశం దక్కే సూచనలు ఉన్నాయనే ప్రచారం ఊపందుకుంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఒక్క ఫైలూ కదలనీయొద్దు!

- ఇరిగేషన్ శాఖకు కలెక్టర్ ఆదేశం
- పలు ఫైళ్లు మాయం చేస్తున్నట్లు ఫిర్యాదులు
- విచారణాధికారిగా డీఆర్‌వో నియామకం
- సెంట్రల్ డివిజన్‌లో విస్తృత తనిఖీలు

నెల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖ సెంట్రల్ డివిజన్‌లో ఒక్క ఫైలు కూడా కార్యాలయం నుంచి బయటకు వెళ్లేందుకు వీల్లేదని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. ఈ ఫైళ్లను తనిఖీ చేసి సెంట్రల్ డివిజన్‌లో పరిస్థితిని సమీక్షించేందుకు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) లవన్నను విచారణాధికారిగా నియమించారు. ఈ క్రమంలో డీఆర్ఓ శనివారం నెల్లూరులోని సెంట్రల్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, ఫైళ్ల వివరాలు తెలుసుకున్నారు. అక్కడ పరిస్థితులన్నిటినీ ఫొటోలు తీసుకున్నారు. ఏ ఏ ఫైళ్లు ఇక్కడ ఉన్నాయన్న వివరాలు తెలుసుకుని రికార్డు చేసుకున్నారు. ఇకపై ఒక్క ఫైలు కూడా సెంట్రల్ డివిజన్ ఈఈ కార్యాలయం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదంటూ డీఆర్ఓ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇది ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

అన్ని శాఖల్లోనూ వణుకు

ఇరిగేషన్ శాఖనే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ కలెక్టర్ ఆదేశాలు వణుకు పుట్టిస్తున్నాయి. సెంట్రల్ డివిజన్ పరిధిలోని పలు ఫైళ్లను మాయం చేస్తున్నారని, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఉన్నతాధికారులు దీనిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన పనుల వివరాలు, అగ్రిమెంట్లు, ఎం బుక్‌లు, అనుమతులకు సంబంధించి ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ బయటకు వెళ్లకుండా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ డీఆర్వోను సెంట్రల్ డివిజన్ కార్యాలయానికి పంపించారు.



ఇరిగేషన్ సెంట్రల్ ఈఈ కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేస్తున్న డీఆర్‌వో లవన్న

చిరస్మరణీయుడు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(సాంస్కృతికం) : తెలుగు భాష, సాహిత్యం, సంగీతం జీవించినంత వరకు గానగంధర్వుడు, పద్మవిభూషణుడు పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం జనహృదయాల్లో చిరస్మరణీయంగా ఉంటారని ప్రముఖ సంగీత దర్శకుడు విద్యాసాగర్ తెలిపారు. శనివారం రాత్రి నగరంలోని పురమందిరంలో బాలు 78వ జయంతి వేడుకలు నిర్వహించారు. చేతన సంగీత సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులందరూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఈనాడు గ్రూపు అధినేత రామోజీరావుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సభకు పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలనతో చేశారు. సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కి బాలు స్మారకార్థం సంగీత విద్వన్మణి, సంగీత విద్వ నటులు అవార్డును సినీ కవి భువనచంద్ర, ఎస్పీ శైలజ, సినీ నటుడు శుభలేఖ సుధాకర్, హైదరాబాద్ కిన్నెర ఆర్ట్స్ కార్యదర్శి మద్దాళి రఘురామ్ ప్రదానం చేశారు. తెలుగుభాష ఔనత్యం, గొప్పదనాన్ని విశ్వవ్యాప్తం చేశారని, భారతదేశంలోని అన్ని భాషల్లో పాడిన విశ్వవిఖ్యాత, గానగంధర్వుడు బాలసుబ్రహ్మణ్యమేనని కొనియాడారు. కార్యక్రమంలో చేతన కార్యదర్శి వై.శేషగిరీషం, వ్యాఖ్యాత డాక్టర్ సీవీ.సుబ్రహ్మణ్యం, వీరిశెట్టి హజరత్‌బాబు, డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, కొల్లూరు శ్రీనివాసరావు, ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యదర్శి ఎస్.బలరామయ్యానాయుడు, వై.వెంకట రామయ్య పాల్గొన్నారు.




సంగీత విద్వన్మణి అవార్డు స్వీకరిస్తున్న విద్యాసాగర్

నగర పాలక సంస్థలో 'ఫోర్జరీ' అలజడి

- కమిషనర్ సంతకాలు నకిలీవంటూ ఫిర్యాదు
- 9 దరఖాస్తుల నెంబర్లు జత చేస్తూ లేఖ
- మేయర్ భర్త పేరు ప్రస్తావించిన న్యాయవాది
- విచారించి నివేదిక ఇవ్వాలన్న కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 8 : నెల్లూరు నగర పాలక సంస్థలోని అవినీతి, అక్రమాలు ఏదో ఒక రూపేణా బయటపడుతూనే ఉన్నాయి. ఆ కోవకు చెందిందే తాజాగా వెలుగు చూసిన ఫోర్జరీ అలజడి. ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదుతో సిటీ ప్లానింగ్‌లో జరుగుతున్న అక్రమాల డొంక కదిలింది. 9 భవనాలకు సంబంధించిన అప్లికేషన్లలో ఉన్నతాధికారుల సంతకాలు నకిలీవని, పైగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లేకుండా మార్టిగేజ్‌లు విడుదల చేసినట్లు ఫిర్యాదుదారుడు తన లేఖలో పేర్కొన్నారు. నెల్లూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన భవనాల తాలూకు పత్రాలలో కమిషనర్ సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు, నిబంధనలు అతిక్రమించి విరుద్ధ పద్ధతిలో ప్రక్రియ నడిచిందని నెల్లూరురూరల్ మండలం ములుముడి గ్రామానికి చెందిన న్యాయవాది కాకు మురళి లిఖితపూర్వకంగా ఎస్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పత్రం శనివారం వెలుగులోకి రావడంతో కలకలం రేగింది. లీగల్ అభిప్రాయాల నేపథ్యంలో కొన్ని పత్రాలు పరిశీలనకు తనవద్దకు రాగ వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన నేపథ్యంలో ఈ బాగోతం బహిర్గతమైనట్లు ఆయన తన ఫిర్యాదులో తెలిపారు. 70 భవనాల వరకు ఇలా తంతు నడిపారని తెలిపిన ఆయన అందులో 9 అప్లికేషన్లు ఆధారాలతో అందచేస్తున్నట్లు చెప్పారు. ఏకంగా కమిషనర్ సంతకమే ఫోర్జరీ జరిగిందని, ఓసీ లేకుండా మార్టిగేజ్ విడుదల చేసినట్లు తాను గుర్తించినట్లు పేర్కొన్నారు. సిటీ ప్లానింగ్‌లో ఇది భారీ స్థాయి అవినీతి బాగోతమంటూ పేర్కొన్న ఆయన లోతైన విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయంటూ విజ్ఞప్తి చేశారు.



మేయర్ భర్త పేరు ప్రస్తావన

నగరంలోని భవన నిర్మాణాలకు సంబంధించి పత్రాలు జారీలో జరిగిన అక్రమాల తంతులో మేయర్ భర్తకు సంబంధం ఉన్నట్లు సదరు ఫిర్యాదుదారుడు తన లేఖలో పేర్కొన్నారు. ఆయనతోపాటు మరో ప్రైవేట్ వ్యక్తి ఉన్నాడని, కొందరు సిటీ ప్లానింగ్ అధికారులు ప్రమేయం కూడా ఉన్నట్లు లేఖలో ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. న్యాయవాది నుంచి ఫిర్యాదు అందుకున్న కమిషనర్ వికాస్‌మర్మత్ తన సంతకాలపై క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదిక అందించాలని సిటీ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు.

పనులు చేయకనే జీతాలు !

- అవుట్‌సోర్సింగ్ కార్మికుల నియామకంలో అక్రమాలు
- మాజీ ఎమ్మెల్యే సిఫార్సు ● ముడుపులతో వైసీపీ అనుచరుల నియామకం

కావలి, జూన్8: అధికారం మనదైతే పనులు చేసినా చేసినా, చేయకపోయినా, నిబంధనలు పాటించకపోయినా అడిగేదెవరు అన్నట్లుగా ఉంది కావలి మున్సిపాలిటీలోని అవుట్‌సోర్సింగ్ కార్మికుల పనితీరు. ఈ ఐదేళ్ల పనులు చేయకుండానే తన అనుచరులకు జీతాలు ఇప్పించి, పార్టీ కార్యక్రమాలు చేయించుకున్నారు. ఇకపోతే దిగిపోయే ముందు కూడా వైసీపీ నేతలు తమ అనుచరులను కొత్తగా చేర్చేందుకు అనుమతులు కూడా తెచ్చుకున్నారు.

● కలుగోళమ్మపేటకు చెందిన ఓ వైసీపీ కార్యకర్త పలుకేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అయినా ఆయన మున్సిపల్ వర్కర్‌గా పనిచేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు అయింది. ఆయనకు మున్సిపాలిటీ నుంచి ప్రతినెలా జీతం కూడా ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో వచ్చాక మున్సిపల్ అవుట్‌సోర్స్ కార్మికులు కూడా పార్టీల నేతలతో ఉండకూడదని నిబంధనతో ఆ వైసీపీ కార్యకర్త చేత సెలవుపెట్టించారు. అలాగే పలువురు వైసీపీ కార్యకర్తలకు మున్సిపాలిటీ నుంచి జీతాలు ఇప్పిస్తూ వైసీపీ నాయకులు వారిని పార్టీ అవసరాలకు, వారి సొంత పనులకు వాడుకున్నారు. ఈ సంగతి అధికారులకు తెలిసినా నేతల ఒత్తిళ్లతో వదిలివేశారు.

● ఆప్కాస్ కింద అనుమతులు


మస్టర్ వేయించుకుంటున్న మున్సిపల్ కార్మికులు

మృతులు, పదవీ విరమణ తదితర కారణాలతో ఆప్కాస్ కింద 27 ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ పోస్టులను విధుల్లో ఉంటూ మృతి చెందిన కార్మిక కుటుంబ సభ్యులకుకానీ, మున్సిపాలిటీ లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న వారితోకానీ, కరోనా కాలంలో కూడా దినసరి కూలీలుగా పని చేస్తున్నవారికి సీనియారిటీని బట్టి నియమించాలి. అలాంటి వారికి ఆప్కాస్ కింద నెలకు రూ.21,000లు జీతం ఇస్తుండటమే కాక, వారిని భవిష్యత్తులో పర్మినెంట్ చేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో వాటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. తాజా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో తన లెటర్ ప్యాడ్‌పై వారికి అనుకూలురైన 27 మందిపేర్లతో ఓ జాబితాను ఇచ్చారు. ఆ జాబితాను అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆర్డీవో శీనానాయక్‌కు పంపారు. ఆయన దాన్ని రెండు పర్యాయాలు తిర్కరించారు. మళ్లీ ప్రతాప్‌రెడ్డి ఆర్డీవోపై ఒత్తిడి తెచ్చి కౌన్సిల్ ఆమోదం పొందారు. దాన్ని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి పంపి అక్కడ అనుమతులు తీసుకుని జిల్లా కలెక్టర్ నుంచి చివరగా అనుమతులు పొందారు. ఈ ప్రాసెస్ అంతా సజావు గా జరిగేందుకు కొంతమంది నేతలు వారి వద్ద ముడుపులు కూడా తీసుకున్నట్లు ప్రచారం ఉంది.ఈ ప్రాసెస్ అంతా జరిగేసరికి ఎన్నికల కోడ్ వచ్చింది.

● దినసరి కూలీలుగా నమోదు

అయితే ఈలోపు వారందరూ దినసరి కూలీలుగా పని చేస్తున్నట్లు మున్సిపల్ రికార్డుల్లో ఎక్కించారు. వారికి వేతనాలు చెల్లించినట్లుగా రికార్డులు తయారుచేశారు. అయితే ఈలోపు రాష్ట్రంలో అధికారం మార టంతో వారి నియమకంపై అధికారులు ఆలోచనలో పడ్డారు. దీంతో తాజా మాజీ ఎమ్మెల్యే నేరుగా వారిని మున్సిపల్ కార్యాలయానికి పంపి, మున్సి పల్ అధికారులకు ఫోన్ చేసి వారిని చేర్చుకోవాలని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఎంతమంది ఉన్నారు.. వారు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో...? తమకు వివరాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను అడిగారు. దీంతో ఆందోళన చెందిన మున్సిపల్ అధికారులు కొత్త నియామకాల పేరుతో వచ్చిన 27 మందిలో 10 మందిని చేర్చు కుని, 17 మంది అర్హులు కాదని తిరస్కరించారు. అలాగే గతంలో పనులు చేయకుండా జీతాలు ఇస్తున్న వారిలో 10 మంది జీతాలు కూడా ఆపివేశారు.

గత కమిషనర్ హయాంలో ఫైల్ నడిచింది

27 మంది పేర్లతో గత మున్సిపల్ కమిషనర్ హయాంలో ఫైల్ నడిచింది. దీంతో తనకు సంబంధంలేదు. వారిని చేర్చుకోమని కలెక్టర్ నుంచి అనుమతులు రాగా, వారిలో 17 మందికి మున్సిపాలిటీకి సంబంధం లేదని తిరస్కరించా. గతంలో పనిచేసినట్లు రికార్డులు లేకపోవడంతో 10 మంది జీతాలు కూడా ఆపేశాం.

- శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పదవికి పేర్నేటి రాజీనామా

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 8 : నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవికి పేర్నేటి కోటేశ్వరరెడ్డి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందిన నేపథ్యంలో తన రాజీనామా పత్రాలను మార్కెటింగ్ కార్యాలయా నికి అందజేశారు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అనుచరుడైన పేర్నేటి గత అక్టోబరు 22న నెల్లూరు ఏఎంసీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజీనామా పత్రాన్ని కార్యాలయం సిబ్బంది మార్కెటింగ్‌శాఖ కమిషనర్‌కు ఈమెయిల్ ద్వారా పంపారు.

సముద్ర జీవుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ముత్తుకూరు, జూన్ 8 : సముద్ర జీవుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు అన్నారు. శనివారం అదాని కృష్ణపట్నం పోర్టులో ప్రపంచ మహా సముద్రాల దినోత్సవం సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టు మెరైన్ డిపార్ట్‌మెంట్ చేపట్టిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర జలాలు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, సముద్ర జలాలు శుభ్రంగా ఉన్నప్పుడే అందులోని జీవరాశుల మనగడ ఉంటుందని, దీంతో పర్యావరణం బాగుండడంతోపాటు మహా సముద్రాల విలువ భావితరాలకు తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ రజిత గార్గ్, కెప్టెన్ సాహా, గణేష్‌శర్మ, వెంకటేష్, బాస్కరన్, ముత్యం జయరామ్, జునీద్, వివిధ విభాగాలు హెచ్‌వోడీలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

- స్టేషన్‌కు వచ్చి చెల్లించాలని ఫోన్లు
- నిర్వాహకులకు సెబ్ ఆఫర్
- మద్యం అక్రమ విక్రయాలకు సుగమం
- నెల్లూరురూరల్లో వివాదాస్పదంగా అధికారుల తీరు



'బెల్టు'కు మామూళ్లు!?

నెల్లూరురూరల్, జూన్ 8 : నెల్లూరురూరల్లో మద్యం అక్రమ విక్రయాలు బహిరంగంగా చేసుకొనేలా అవకాశం కల్పిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) అధికారుల తీరు వివాదాలకు వేదికగా మారింది. అక్రమ మద్యం అమ్ముకోండి.. కానీ నెలనెలా మామూళ్లు ఇవ్వండంటూ ఏకంగా సెబ్ స్టేషన్‌కు చెందిన కొందరు అధికారులు, సిబ్బంది నిర్వాహకులకు ఫోన్లు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్టేషన్‌కు వచ్చి నెలవారీ మామూళ్ల ఫిక్స్ చేసుకుని వెళ్లాలని బంపరాఫర్ ఇస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున తాము కఠినంగా వ్యవహరించామే తప్ప ఇక నుంచి అలాంటి పరిస్థితి ఉండదని భరోసా కల్పించడం గమనర్హం. ప్రభుత్వ మద్యం షాపుల్లోనే లిక్కరు కొనుగోలు చేయాలి. అక్రమంగా ఎక్కడ మద్యం అమ్మడానికి వీలు లేదు. అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు నిలువరించేందుకు వైసీపీ ప్రభుత్వ సెబ్ శాఖను సృష్టించింది. ప్రతి మండలానికి ఒక స్టేషన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. కానీ నెల్లూరురూరల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. అక్రమంగా మద్యం విక్రయించేవారికి సెబ్ అధికారులు కొమ్ముకాస్తూ వారి నుంచి మామూళ్లు అందుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇందుకు తాజాగా వెలుగులోకి వచ్చిన. నెల్లూరురూరల్ సెబ్ కార్యాలయం నుంచి కొందరు అధికారులు ఏకంగా బెల్టు షాపుల నిర్వాహకులకు ఫోన్లు చేసి స్టేషన్‌కు పిలిచి ఆఫర్లు ఇవ్వడమే నిదర్శనం.

రంగంలోకి బృందాలు

నెల్లూరురూరల్లోని గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నది ఎవరు...? ఊరికి ఎంత మంది ఉన్నారు...? అంటూ లెక్కకడుతున్న సెబ్ అధికారులు వారిందరికీ ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బాధ్యతలను స్టేషన్‌కు చెందిన కొందరు కానిస్టేబుళ్ల బృందాలుగా ఏర్పడి నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ రాక ముందు బెల్టు నిర్వహించిందెవరు...? కోడ్ అమల్లోకి వచ్చాక పట్టుబడిందెవరు...? రాజకీయ నాయకుల అండదండలతో షాపులను నడుపుతున్నదెవరు...? అంటూ లెక్కలు తీస్తున్న ఈ బృందాలు వారందరికీ నెలవారి మామూళ్ల బాధ్యతలను అప్పగిస్తున్నట్లు విమర్శలున్నాయి.

నెలకు ఎంత....?

సెబ్ అధికారులు ఇస్తున్న నెలవారి మామూళ్ల ఆఫర్లను కొందరు బెల్టు షాపుల నిర్వాహకులు స్వీకరిస్తున్నారు. స్టేషన్‌కు వెళ్లి తమ ఆమోదాన్ని తెలుపుతున్నారు. కానీ నెలకు ఎంత కట్టాలి...? అన్నది ప్రస్తుతం స్పష్టత లేదు. త్వరలో కొత్త ప్రభుత్వ కొలువుదీరనున్న నేపథ్యంలో అధికారులందరు బదిలీపై వెళ్లిపోవడం జరుగుతోంది. ఇప్పుడు మామూళ్ల డబ్బులు కడితే కొత్త అధికారులు వస్తే మళ్లీ కట్టాల్సి వస్తుందంటూ బెల్టు నిర్వాహకులు భావిస్తున్నారు. పైగా కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తున్నందున అప్పుడు చూసుకోవచ్చంటూ మరికొందరు వెనకడుగు వేస్తున్నారు.

రేపు పీఈటీల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం

నెల్లూరు(విద్య), జూన్ 8 : జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీ.శ్రీనివాసులు, పీ.థామస్‌పీటర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది చేపట్టబోవు కార్యక్రమాలపై కార్యాచరణతో పాటు క్రీడారంగంలోని సంస్కరణలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులందరూ ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

187 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 8: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 901పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 16కంపెనీ ప్రతినిధులు పాల్గొని 714బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-119, ఆర్‌ఆర్-6, సీఆర్-35, జంపింగ్‌లాట్స్-27 కారణాలతో 187బేళ్ల తిరస్క రణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.293గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

'సోమశిల'కు 521 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, జూన్ 8: నైరుతీ రుతుపవనాల ప్రభావంతో రాయలసీమ జిల్లాలో చెదురుముదురుగా కురుస్తున్న వర్షాలతో సోమశిలకు డ్యాంకు వరదనీరు వచ్చి చేరుతోంది. డ్యాం క్యాచ్‌మెంట్ పరిధిలోని వాగులు, వంకల నుంచి నదిలోకి చేరుతోంది. దీంతో శనివారానికి 521 క్యూసెక్కులు వరద రాగా నీటిమట్టం 269.26 అడుగులతో 7.293 టీఎంసీలు ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ఉదయగిరి కోటపై టీడీపీ జెండా

ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ విజయం సాధించడంతో కలిగిరి మండలం కొత్తూరు గ్రామస్థులు శనివారం ఉదయగిరికి తరలివెళ్లి కోటపై టీడీపీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సురేష్ చంద్రబాబు ప్రోత్సహంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నిలపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వెలగపాడు మాజీ సర్పంచి కేతినేని సాంబశివ రావు, నాయకులు కేతినేని శ్రీకాంత్, బెజవాడ రమేష్, కూరపాటి వెంకట్రావు, అద్దంటి మహేంద్ర, గుళ్ళ మధు, నలజర్ల మాధవ, కనగాల వెంకట్, శిడిపోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- కలిగిరి


కోనలో లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం


చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జిల్లావ్యాప్తంగా పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నెల్లూరు(క్రైం), జూన్ 8: శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో, ప్రధాన రహదారులు, కూడళ్లలో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ ఎన్నికల కౌంటింగ్ తర్వాత కూడా గ్రామాల్లో హింసకు తావులేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలందరూ జీవించాలని కోరారు.

డీసీఎంఎస్ చైర్మన్ రాజీనామా

నెల్లూరు (హరనాథపురం): నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పీఐసీ కమిటీ చైర్మన్ వీరి చలపతిరావు శనివారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణంతో రాజీనామా చేస్తున్నట్లు సహకార శాఖ కమీషనర్‌కు ఆయన లేఖ పంపారు. తన రాజీనామాను ఆమోదించాలని కమీషనర్‌ను ఆ లేఖ ద్వారా కోరారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్పీ


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 8: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి ఎస్పీ అర్జీలు స్వీక రించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పారదర్శకతతో సిబ్బంది కోరుకున్న చోటుకు ఖాళీల ఆధారంగా స్థాన చలనం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

విడవలూరు, జూన్ 8: విద్యుదాఘాతానికి గురై ఓ వివాహిత మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముదివర్తి గ్రామం గాంధీనగర్‌కి చెందిన తాండ్ర పుష్ప (25)కు ఊటుకూరు శంకర్ నగర్ కాలనీకి చెందిన నాగార్జునతో సుమారు 8ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం. వీరు పంచాయతీ కుళాయికి సక్రమంగా నీరు రాకపోవడంతో చిన్న విద్యుత్ మోటారుని ఏర్పాటుచేసుకుని తద్వారా నీటిని పట్టుకునేవారు. ఈక్రమంలో శుక్రవారం గ్రామంలో ఈదూరు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో మోటారుకి ఉన్న వైర్లు తెగిపోయాయి. ఈ విషయం తెలియని పుష్ప స్విచ్ వేసినా మోటారు తిరగకపోవడంతో మోటారుని పరిశీలిస్తుండగా తెగిపోయిన వైరు తగలటంతో విద్యుదాఘాతానికి గురై ఆమె అక్కడిక్కడికే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


పుష్ప మృతదేహం

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

కావలి రూరల్, జూన్ 8 : రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కావలిలోని ఉదయగిరి బ్రిడ్జి సమీపంలో శనివారం రాత్రి జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు, 25 నుంచి 30 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని ఎగువ మార్గంలో నెల్లూరు వైపు వెళ్తున్న రైలు ఢీ కొన్నట్లు లోక్ పైలెట్ సమాచారం ఇచ్చినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. స్కైబ్లూ కలర్ ఆఫ్ హ్యాండ్స్ టీషర్టు, బులుగు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	164
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	288
స్కిన్‌లెస్	318
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6764
వెండి కిలో ధర	రూ. 91,100
వెండి ఒక గ్రాము	రూ. 93.10

భవనంపై నుంచి పడి కూలీ దుర్మరణం

అల్లూరు, జూన్ 8 : భవనంపై నుంచి పడి గాయాలపాలై చికిత్స పొందుతూ కూలీ మృతి చెందాడు.ఈ ఘటనపై పోలీస్‌స్టేషనులో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు, శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కొడవలూరు మండలం రేగడిచెలికకు చెందిన పత్రా లక్ష్మయ్య అల్లూరు మండలం నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలో భవన నిర్మాణ పనుల కోసం వచ్చాడు. పనులు చేస్తుండగా అదుపుతప్పి పైనుంచి కింద పడ్డా రు. తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్న లక్ష్మయ్యను స్థానికులు వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీ

నెల్లూరు(వైద్యం), జూన్ 8 : నెల్లూరు నగరంలోని ఇమేజ్ స్కానింగ్ సెంటర్, నెల్లూరు వాస్క్యులర్ కేంద్రం, ఇందిరా స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శనివారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పీసీపీఎన్‌డీటీ నిబంధనలు పాటిస్తున్నాయా లేదా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డెమో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితిలోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, అలా చేసే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజ శ్రేయస్సుకు ఆడపిల్లల ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. లింగ నిష్పత్తి సమానతలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఫారం ఎఫ్‌ను అప్‌లోడ్ చేయడంలో అలసత్వం వద్దని నిర్వాహకులను హెచ్చరించారు.


స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

గజేంద్ర మోక్షం ఉత్సవాల ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 8 : నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజేంద్రమోక్షం ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో వెలిసి ఉన్న శ్రీకృష్ణ భగవానుడికి విశేష పూజలు జరిగాయి. రాత్రి మత్స్యవతార అలంకారం కనువిందు చేసింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 14వ తేదీ వరకు జరుగుతాయి.


మత్స్యావతార అలంకారంలో శ్రీకృష్ణుడు

కమనీయం నృసింహస్వామి కల్యాణం

రాపూరు(డక్కిలి), జూన్ 8: పెంచలకోన చెంచులక్ష్మి, ఆదిలక్ష్మీ సమేత నృసింహస్వామి శనివారం కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 10గంటలకు ఆలయ అర్చకులు స్వామి కళ్యాణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 5-30 గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నృసింహ స్వామి వారికి తరుచ్చి పల్లకీ సేవ, రాత్రి సహస్ర దీపాలంకరణ (ఊజల్ సేవ) సేవలు చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామి క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఏసీ సాగర్‌బాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు. అనంతరం పెంచలకోన ఏసీ సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, ఆలయ పూజారులు, మాజీ పాలకవర్గ సభ్యులు సోమయ్య కురుగొండ్ల రామకృష్ణ దంపతులకు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపి ఆశీర్వదించారు.

ఏమార్చి నగదు అపహరణ

కలిగిరి, జూన్ 8 : కలిగిరిలోని కొండాపురం రహదారిలో ఓ ఎలక్ట్రిక్ దుకాణంలో యజమానురాలు దాసరి విజయమ్మను ఏమార్చి ఇద్దరు ఆగంతకులు శనివారం రూ.50 వేలు నగదు తీసుకెళ్లారు.బాధితురాలి కథనం మేర కు, గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి బల్బు కొనుగోలు చేసి చిల్లర కోసమంటూ తనని ఏమార్చి క్యాష్ కౌంటర్ లోని రూ.50 వేలను తీసుకెళ్లారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరేది?

- జీజీహెచ్ అధికారులపై టీడీపీ నేతల ఆగ్రహం

నెల్లూరు(వైద్యం), జూన్ 8 : నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్నికలకు ముందు ప్రారంభించిన చిన్నపిల్లల పోషకాహార పునరావాస కేంద్రం శిలాఫలకంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి పేరు లేకపోవడంపై టీడీపీ నేతలు సంబం ధిత అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పలువురు నాయకులు ఆ శిలాఫకంలో పేరు లేకపోవడాన్ని గుర్తించారు. ఈ భవనం ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న జీజీహెచ్‌లో మార్చి 5వ తేదీన ఈ భవనాన్ని అప్పటి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. శిలాఫలకంలో మంత్రు లు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పేర్లతో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేరు తప్ప నిసరిగా ఉండాలి. అయితే వైసీపీ వీడారన్న కక్షతో ఎమ్మెల్యే పేరును తొలగించారని, దీనికి అప్పటి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కారణమంటూ మండి పడుతున్నాయి. ఈ నేపథ్యంలో శిలాఫలకాన్ని మార్చాలని నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కార్యాలయానికి తాళాలు వేయగా తాజాగా ఈ ఎన్ఆర్‌సీ కేంద్రంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


జీజీహెచ్‌లో పోషకాహార పునరావాస కేంద్రం

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రామోజీరావు మృతికి సంతాపం

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీరావు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతి పట్ల పార్టీలకు అతీతంగా నేతలు సంతాపం తెలిపారు. రామోజీ మృతి రెండురాష్ట్రాల తెలుగువారికి తీరని లోటని పలువురు నేతలు పేర్కొన్నారు. పలుచోట్ల ఆయన చిత్రపటం ఉంచి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కావలిలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తదితరుల నివాళి



కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి, తదితరులు



ఉదయగిరి : రామోజీరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న చెంచలబాబు

ఆత్మకూరు : రామోజీరావు మృతికి ఏపీయుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య, జిల్లా కమిటీ సభ్యులు, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు శనివారం సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు.

ఉదయగిరి రూరల్ : స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ బయ్యన్న, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ, గడ్డం శ్రీనివాసులు, ఓబులరెడ్డి, మాబాషా, సజిల్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ శనివారం హైదరాబాదులోని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

కలువాయి: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, గండపనేని హరి నాయుడు, మాధవనాయుడు, చల్లా రాధాకృష్ణారెడ్డి, నూటేటి నరసింహులు యాదవ్ పాల్గొన్నారు.

వరికుంటపాడు: టీడీపీ మండల కన్వీనర్, ప్రధాన కార్యదర్శులు చంద్ర మధుసూదనరావు, శ్రీకాంత్‌యాదవ్‌లు స్థానిక పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కావలి : రామోజీరావు మృతి తెలుగువారికి తీరని లోటని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం రామోజీ చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామోజీరావు మృతి తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, పోతుగంటి శ్రీకాంత్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాత్రికేయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి పక్కన రామోజీరావు చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్ రవిప్రకాష్, ఇంటూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. రామోజీరావు మృతి పత్రికారంగానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కొండాపురం : రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరనిలోటని నెల్లూరు పార్లమెంటు టీడీపీ రైతు కార్యదర్శి పోలినేని రమేష్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత వేములపాటి మణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రగుంట : రామోజీరావు మృతికి పలు పార్టీల నేతలు శనివారం నివాళులు అర్పించారు.బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుధీర్‌బాబు, మాధవరావు, మస్తాన్‌నాయుడు, నరసింహరావు, జయరాజు, తిరుపతి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం కార్యాలయంలో మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామయ్య, ఎగ్రా, కాలేషా, బాదుల్లా తదితరులు ఉన్నారు.



కలువాయిలో..



వరికుంటపాడులో నేతల నివాళి

కలిగిరి : జర్నలిజం ద్వారా రామోజీరావు దేశానికి ఎంతో సేవ చేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చీమల తాతయ్య, ఊసా మాల్యాద్రి, కాకు మహేష్, చేరెడ్డి సుబ్బారెడ్డి, నిశ్శంకర సురేష్, జిర్రా చినఅంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రామోజీరావు జర్నలిజాన్ని తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేందుకు కృషి చేశారన్నారు. కాగా అల్లూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

కందుకూరు : రామోజీరావు మృతిపట్ల కందుకూరు టీడీపీ ఘనంగా నివాళులర్పించింది. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప కార్యక్రమాన్ని బీఎస్‌బీ న్యూస్ చానల్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కె. హరిబాబు, ఎం. కిష్టాఫర్, జి. శ్రీనివాసులు, మాధవరావు తదితరులు మాట్లాడారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉదయగిరిలో..



కొండాపురంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

సీతారామపురం: స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ మండలాధ్యక్షుడు దేవర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దగౌస్, రాజశేఖర్, పిడుగు జయరాములు, రాజమహేంద్రవరం చంద్ర, ఏడో వార్డు నెంబర్ తోట మనోజ్ పాల్గొన్నారు.

లింగసముద్రం : రామోజీరావు మృతికి మండల టీడీపీ నేతలు ని వాళులు అర్పించారు. శనివారం సాయంత్రం లింగసముద్రంలోని టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షులు వేముల గోపాలరావు తదితరులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గాలంకి ప్రసాద్, అంగులూరి చిన్నకొండయ్య, డింకం శేషయ్య, ఏ. చినసత్యం, బొజ్జా శ్రీనివాసులు, ఎలిపాటి శ్రీనివాసులు, ఘైలా రామకేశవులు, జనసేన నాయకులు చింతా దేవదాసు ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.



చిత్రగుంట : నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు



కలిగిరిలో..



సీతారామపురంలో..



లింగసముద్రంలో నివాళి

ఇంకెన్నాళ్లీ దుస్థితి..!

- పురాతన భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ
- వానొస్తే ఉరుస్తున్న కప్పులు
- అసంపూర్తిగా కొత్త భవన నిర్మాణాలు

ఆత్మకూరు, జూన్ 8: వైసీపీ ఐదేళ్లపాలనలో ఆత్మకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పడకేశాయి. కోట్ల రూపాయలతో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోడంతో పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్న భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వర్షాలకు భవనాల పైభాగాన పట్టలు కప్పుకొని రికార్డులు తడవకుండా జాగ్రత్త పడాల్సిన దుస్థితి నెలకొంది.



అర్థంతరంగా ఆగిపోయిన తహసీల్దారు కార్యాలయం

● పదేళ్ల కిందట..

అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టణంలో ఆర్డీవో కార్యాలయ సముదాయ నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేయించారు. 2013 జూన్ 25వ తేదీన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పదేళ్లు పూర్తయినా నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. బ్రిటీష్ కాలంలో నిర్మించిన పురాతన భవనంలోనే తహశీల్దారు కార్యాలయం కొనసాగుతోంది. వానొస్తే భవనం ఉరుస్తుండటంతో పైభాగాన్ని ప్లాస్టిక్ తార్పాలిన్లు కప్పి కాలం వెళ్లదీస్తున్నారు. 2012లో రూ.50లక్షలతో రహదారులు, భవనాలశాఖ అతిథిగృహం పనులు ప్రారంభించారు. అరాకొర పనులు పూర్త యినా నేటికి వినియోగంలోకి రాలేదు. అసంపూర్తి భవన నిర్మాణాలు పూర్తయితే రెవెన్యూ, తహసీల్దారు, అగ్రికల్చర్, ట్రెజరరీ, డీఎస్పీ కార్యాలయాలతో పాటు అటవీ, జలవనరుల శాఖ, సోమశిల ప్రాజెక్టు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం అన్నీ ఒకే ప్రాంగణంలో రూపుదిద్దుకుంటాయి.



ప్రారంభానికి నోచుకోని ఆర్అండ్‌బీ అతిథిగృహం

● మరికొన్ని అభివృద్ధి పనులు..

పట్టణం బట్టేపాడు రోడ్డు సమీపంలో పదేళ్ల క్రితం రూ.1.28కోట్లతో మున్సిపల్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులుపూర్తి కాక అసంపూర్తిగానే మిగిలిపోయాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది.

● నెల్లూరుపాళెం సమీపంలో ఆర్ అండ్‌బీ అతిథిగృహం ఉంది. అది పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో ఆత్మకూరు చెరువుకట్ట సమీపంలో నూతన భవన నిర్మాణానికి రూ.50లక్షలతో 2013 లో శంకుస్థాపన చేశారు. నిర్మాణప నులు పూర్తయినా ప్రారంభానికి నోచు కోక నిరుపయోగంగానే దర్శనమి స్తుంది.

మినీ స్టేడియం నిర్మాణం కోసం ఎదురుచూపులే.. !

నిర్మాణ పనులు త్వరితిగతిన పూర్తయితే రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు అనువుగా ఉండడంతో పాటు వెతలు తప్పుతాయని క్రీడా కా రులు ఎదురుచూస్తున్నారు. ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యే గా తిరిగి విజయం సాధించడంతో ప్రజల్లో ఆశలు రేకెత్తించాయి. ఆత్మకూరు అభివృద్ధిని ఆనం పరుగులు తీయిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఆలయాల్లో మొక్కు చెల్లించి.. తిరుమలకు పాదయాత్ర



కొండాపురం : పాదయాత్రగా మాలకొండకు వెళ్తున్న ఇస్కపాలెం టీడీపీ కార్యకర్తలు



వీవీపాలెం : మాలకొండలో మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ కార్యకర్తలు



కందుకూరు : పాదయాత్రకు జెండా ఊపుతున్న టీడీపీ నాయకులు

కొండాపురం, జూన్8: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయ సాధించాలని మొక్కుకున్న కార్యకర్తల కోరిక నెరవేరడంతో శనివారం వారు మొక్కు చెల్లించారు. మండలంలోని ఇస్కపాలెం వాసులు కొందరు చంద్రబాబు తిరిగి సీఎం కావాలని, ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీగా వీపీఆర్ గెలవాలంటూ ఎన్నికల ముందు మొక్కుకున్నారు. వారంతా విజయం సాధించడంతో గ్రామ టీడీపీ నాయకులు దామా శివబాబు, బొల్లినేని వెంకట రమణయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీ నరసింహులు, మహిళా నాయకురాలు కుంకు జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పలువురు వలేటివారిపాలెం మండలం మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. అంతకుముందు గ్రామంలోని రామాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మెల్లంపూడి మాల్యాద్రి, కొమ్మి ప్రభాకర్, ఓరుగంటి సుమన్, నాదెండ్ల రమేష్, మెల్లంపూడి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు కందుకూరు ప్రాంతానికి చెందిన పార్టీ అభిమానులు మొక్కులు తీర్చుకునేందుకు స్థానిక అంకమ్మ ఆలయం నుంచి శనివారం తిరుపతికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో వారు మార్గమధ్యంలోని గుడ్లూరుకు శనివారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఈ పాదయాత్రలో టీడీపీ కార్యకర్తలు అబ్బూరి వేణు, మధిర బ్రహ్మరూప్, అబ్బూరి చందు, పత్తిపాటి పవన్, మద్దెల సాయి. వేమూరి సాయి, వేమూరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీడీపీ కార్యకర్తలు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అత్యధిక మెజారిటీతో విజయం పాదించడంతో పోలినేనిపాలెంనకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు మాలకొండలో కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉట్లపల్లి సింహాద్రి, మామిళ్లపల్లి మాధవరావు, సాదు వేణు, ఎండ్లూరి హనుమంతరావు, నేలకూరి చెన్నకేశవులు, మధులూరి హనుమంతరావు, గోశాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించి చంద్రబాబు సీఎం బాధ్యతలు స్వీకరించబోతుండటం, కందుకూరులో ఇంటూరి నాగేశ్వరరావు ఘనవిజయం సాధించటం పట్ల శనివారం పలువురు అభిమానులు కందుకూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా గ్రామదేవత అంకమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి బయలుదేరారు. అబ్బూరి వేణు, అబ్బూరి చందు, మధిర బ్రహ్మరూప్, పత్తిపాటి పవన్, మద్దెల సాయి, వేములూరి సాయి, వేములూరి బ్రహ్మం తదితరులు పాదయాత్రగా బయలుదేరగా, స్థానిక టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మంగపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి వర్షపు నీరు



వెంకట్రావుపల్లి చెరువులో చేరిన వర్షపు నీరు

ఉదయగిరి, జూన్ 8: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి వెంకట్రావుపల్లి, నేలటూరు, గడ్డంవారి పల్లి, శకునాలపల్లి, దాసరిపల్లి చెరువుల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో మూగజీవాలకు తాగునీటి తిప్పలు తప్పాయని పశు పోషకులు హర్షం వ్యక్తం చేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు

ఉదయగిరి, జూన్ 8: పట్టణంలోని షబ్బీర్ కాలనీ, గండిపాళెం మార్గం, అన్నపూర్ణనగర్‌లో వెళ్లిన విద్యుత్ మెయిన్‌లైన్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను శనివారం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. దారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ పనులతో ఉదయం 8నుంచి మధ్యా హ్నం 2గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాకు నిలిపివేశారు. పనులు ముగిసిన అనం తరం సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు ఖలీల్, అజీజ్ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

బుజ్జిరెడ్డి అంత్యక్రియల్లో బీజేపీ నేతలు

సంగం, జూన్ 8: వ ం ం డ ల కే ం ద్ర ం లో శనివారం జరిగిన బుజ్జిరెడ్డి అంత్యక్రియల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్ర రెడ్డి, కాకు విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుజ్జిరెడ్డి పార్థివ దేహానికి పార్టీ జెండా కప్పి అంత్యక్రియలు నిర్వహించారు.



పార్థివ దేహంపై పార్టీ జెండా కప్పుతున్న బీజేపీ నేతలు

ఆత్మకూరు: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి అకాల మరణంపై పార్టీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంఘ్ స్వయం సేవక్‌గా పనిచేసి అంచలంచెలుగా ఎదిగి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీ పటిష్టతకు కృషి చేసినట్లు కొనియాడారు.

సంగంలో 33.6 మి.మీ వర్షపాతం

సంగం, జూన్ 8: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి 33.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో వీధులన్నీ జలమయమైయ్యాయి. ఈ సమయంలో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి

ఉదయగిరి రూరల్, జూన్ 8: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయని వివాదాల జోలికి వెళ్లకుండా స్నేహపూర్వకంగా మెలగాలని ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల వరకే పార్టీలు ఉండాలని, అనంతరం కుటుంబంలా కలిసి ఉండాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్డెన్‌సెర్చ్‌లో స్వాధీనం చేసుకొన్న వాహనాలకు యజమానులు వాహనపత్రాలు చూ పించి తీసుకెళ్లాలని సూచించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐలు

మాలకొండ ఆదాయం రూ. 14,87,405

వలేటివారిపాలెం, జూన్ 8 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 14,87,405 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 10 వేలు, కుంకుమార్చన ద్వారా రూ. 28,200, తలనీలాల ద్వారా రూ. 73,175, వాహనపూజల ద్వారా రూ. 4,760, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,90,500, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 680, రూముఅద్దెల ద్వారా రూ. 32,620, కవర్లు ద్వారా రూ. 6,900, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,10,840, అన్నదానం ద్వారా రూ.5,26,129, విరాళా ద్వారా రూ. 2,03,601 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

పిడుగుపడి మేకల మంద మృతి

కందుకూరు, జూన్ 8 : ఉరుములు, మెరుపులతో వర్షంతో చెట్టు కింద ఉన్న మేకల మందపై పిడుగుపడి మరణించాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బలిజపాలెంకు చెందిన గొర్రెల కాపరి గోకరాజు రాఘవయ్య తనకున్న 25 మేకలు, 2 గొర్రెలను పక్కనే నర్సింగోల్ గ్రామం పొలాల్లో మేపుకుని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మేకలు చెట్ల కిందకు వెళ్లాయి. ఉన్నపలంగా ఉరుములతో మెరుపులతో పెద్ద శబ్దం చేస్తు పిడుగు పడటంతో కుప్పకూలి మృతిచెందాయి. విషయాన్ని పశు వైద్యుడు దృష్టి తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. మేకలను కొనుగోలు చేసిన వెంటనే ఇంటర్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కావలి ఎమ్మెల్యేకి బీద సన్మానం

నెల్లూరు(వైద్యం), జూన్ 8 : కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర దంపతులు శనివారం సన్మానించారు. నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న బీద నివాసానికి వచ్చిన కృష్ణారెడ్డిని బీద దంపతులు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర సతీమణి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల పొంగళ్లకు ఆలయాల ముస్తాబు

చిత్రగుంట, జూన్ 8: బోగోలు మండలం కోవూరుపల్లిలో గ్రామదేవతలు పోలేరమ్మ, కనకదుర్గమ్మలకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, పొంగళ్లు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయాలను శనివారం విద్యుత్ దీపాలంకరణలతో అలకరించారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పొంగళ్ల కార్యక్రమం ఉంటుందన్నారు. సోమవారం అమ్మకు శాంతి పూజలు, మంగళవారం అభిషేకం ఉంటాయి.అలాగే కొత్తూరులో ఉన్న నాగవరపమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తునట్లు ఆలయ వ్యవస్థాపకుడు మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. కాగా టీడీపీ విజయంపై నాగులవరంలోని పోలేరమ్మకు యలగసిరి మహేష్, అంకయ్యలు ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించనున్నారు.

జలదంకిలో కూటమి నేతల సమావేశం

జలదంకి, జూన్8: నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ విజయానికి కృషి చేసిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ శనివారం స్థానిక కూటమి కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండలంలోని 17పంచాయతీల నుంచి భారీగా నేతలు, కార్యకర్తలు తరలిరావడంతో కూటమి కార్యాలయం కిటకిటలాడింది. మండల టీడీపీ అధ్యక్షుడు వీ మధుమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి మాట్లాడారు. అలాగే జనసేన నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సోదరుడు మాల్యాద్రిరెడ్డి తదితరులు కూడా ప్రసంగించారు. ఈ సమావేశంలో నాయకులు మందపల్లి మాల్యాద్రియాదవ్, పచ్చా పెంచలయ్యనాయుడు, కంచర్ల వినోద్‌నాయుడు, గొర్రెపాటి యలమందారెడ్డి, ఉప్పుటూరి సుధీర్, డాక్టర్ పీవీ రమణయ్యలు. మునగాల తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పనిభారంతో ఆర్టీసీ డ్రైవర్లు : జేఏసీ

కందుకూరు, జూన్ 8 : స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ల నిరంకుశ వైఖరితో డ్రైవర్లపై పనిభారం, ఒత్తిడి పెరుగుతుందని, ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు కందుకూరు డిపో జేఏసీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓవర్ డ్యూటీలు, లింక్ డ్యూటీల పేరుతో కొత్తగా చార్జులు వేస్తున్నారని వారు తెలిపారు. డిపోలోని 4 యూనియన్లు ఈ విధానాన్ని వ్యతిరేకస్తున్నప్పటికి డిపో మేనేజర్, అసిస్టెంటు మేనేజర్లు మొండిగా ప్రవర్తిస్తున్నారని వారు వివరించారు. జిల్లా ఆర్టీసీ డీపీటీవోని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినా, నూతనంగా ఎన్నికైన కందుకూరు, కొండపి ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్నా డిపో మేనేజర్,అసిస్టెంట్ మేనేజర్లలో ఎలాంటి మార్పు లేదన్నారు. పైగా మీరు ఎవరికి చెప్పుకున్నా చార్జులు వేసి తీరుతానని డీఎం నిక్కచ్చిగా తేల్చి చెప్తున్నాడని జేఏసీ నాయకులు ఆ ప్రకటనలో తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



నారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్ననాయకులు

ప్రతి క్షణం ప్రజల కోసమే..

● నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), జూన్ 8 : సార్వత్రిక ఎన్నికల్లో తనకు అఖండ విజయం సాధించి పెట్టిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇక ప్రతి క్షణం ప్రజల కోసం పని చేస్తానని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శనివారం నారాయణ క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమీక్షించారు. నెల్లూరు నగరలో అస్తవ్యస్తంగా ఉన్న అభివృద్ధిని గాడిలో పెట్టి సమగ్రాభివృద్ధి సాధించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. నగర ప్రజల రుణం తీర్చుకునేలా క్షేత్రస్థాయి నుంచి పనిచేస్తామని తెలిపారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన కార్యకర్త బాబు భార్య రహంతున్నీసాకు నారాయణ క్యాంపు కార్యాలయంలో రూ.50 వేల చెక్ అందజేశారు. నారాయణ మాట్లాడుతూ బాబు మృతి బాధాకరం అన్నారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజానాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి..

నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ శనివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లారు. ఆయనకు కోటంరెడ్డి సోదరులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించడంపై అభినందించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజానాయుడు, సాబీర్‌ఖాన్, సునీల్, అరవ శీను, కార్పొరేటర్ మురారి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం నివాసానికి పొంగూరు..

నెల్లూరు నగరంలోని 47వ డివిజన్‌లో టీడీపీ అన్ని డివిజన్‌ల కంటే అత్యధిక మెజార్టీ సాధించింది. ఇందుకు కృషి చేసిన మాజీ కార్పొరేటర్, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు నివాసానికి ఎమ్మెల్యే పొంగూరు నారాయణ వెళ్లారు. సుబ్బారావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్రను కలిసిన ఎమ్మెల్యేలు



కావ్య కృష్ణారెడ్డి సన్మానిస్తున్న బీద దంపతులు, పుష్పగుచ్ఛం ఇస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), జూన్ 8 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్రను నెల్లూరు రూరల్, కావలి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శనివారం ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బీద కూడా వారిని సన్మానించి మిఠాయి తినిపించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను కోటంరెడ్డి సోదరులు ఆత్మీయంగా సత్కరించారు.

● మీసేవ సంఘం నాయకుల శుభాకాంక్షలు

నెల్లూరురూరల్ : నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్ రెడ్డిలను జిల్లా మీ సేవ అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లిన నాయకులు అనిల్‌కుమార్, ముక్తియర్, అహ్మద్, దామోదర్‌లు శాలువాతో సత్కరించారు. మీసేవ నిర్వహకుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ మంత్రి అనిల్, ఆయన అనుచరుడు మోసం చేశారు

● బాధితుడు పెనాకా బలరామిరెడ్డి



మాట్లాడుతున్న బలరామిరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూన్ 8 : కుటుంబ కలహాల సమస్య పరిష్కరించమని మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఆయన అనుచరుడు మధన్‌మోహన్ రెడ్డిని సంప్రదిస్తే వారు తనను మోసం చేశారని బాధితుడు పెనాకా బలరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ కలహాలు పరిష్కరించేం దుకు అనిల్ అనుచరుడు తనవద్ద రూ.5 లక్షలు తీసుకు న్నారని, అయితే సమస్య పరిష్కరించలేదన్నారు. ఈ విష యం అనిల్ దృష్టికి తీసుకెళితే ఆయన మదన్‌మోహన్ రెడ్డికే మద్దతు పలికారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తు తం టీడీపీ అధిదికారంలోకి రావడం వల్ల తాను ధైర్యంగా ముందుకు వచ్చానని చెప్పారు. తాము చెల్లించిన రూ.5 లక్షలు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అక్షర మహర్షికి ఘన నివాళులు



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 8: ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు చిత్రపటానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయన కార్యాలయంలో శనివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పత్రిక రంగానికి రామోజీరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మీడియా జిల్లా కోఆర్డినేటర్ జలదంకి సుధా కర్, సాబీర్‌ఖాన్, శ్యామ్, నరేష్, జాఫర్ పాల్గొన్నారు.

తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది : ఎమ్మెల్యే ఆనం

నెల్లూరు(హరనాథపురం) : ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగువారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీ తెలుగు ప్రజల ఆస్తి అని పేర్కొన్నారు. ఆయన మరణం తెలుగు ప్రజలకే కాదు దేశానికి కూడా తీరని లోట న్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తు న్నానని పేర్కొన్నారు.

నెల్లూరు(సాంస్కృతికం): రామోజీ గ్రూపు అధినేత రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు గంధవళ్ల ఉమాశంకర్ మర్రి ఆకుపైన రామోజీరావు చిత్రా న్ని, మరొక మర్రి ఆకుపై ఈనాడు అనే చిత్రాన్ని చిత్రించి వారికి నివాళులు తెలిపారు.

● కళాకారుల సంతాపం

ఎందరికో మార్గదర్శిగా నిలిచిన ఈనాడు గ్రూపు చైర్మన్ రామోజీరావు మృతికి జిల్లాలోని పలు వురు కళాకారులు తమ సంతాపాన్ని తెలిపారు. రామోజీరావు మరణం తనను కలచివేసిందని హాస్య నటుడు దోర్నాల హరిబాబు పేర్కొన్నారు. హాస్య నటుడిగా తనను ఈనాడు పత్రిక ద్వారా ఎంతో ఉన్నత స్థాయికి తీసుకెళ్లార న్నారు. ఈటీవీలో ప్రసారమైన స్మైల్ రాజా స్మైల్, జబర్దస్త్ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పించారని తెలి పారు. నవ్వుల్ నవ్వుల్ కార్యక్రమానికి యాంకర్‌గా రామోజీరావు అవకాశం కల్పించారని తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుం బానికి తన ప్రగాఢ సంతాపం తెలి పారు. అలాగే ప్రపంచ తెలుగు మహా సభ రీజియన్ చైర్మన్ ఎన్.బలరామయ్య నాయుడు, మైక్రో చిత్రకారుడు అమీర్ జాన్‌తో పాటు వివిధ కళాకారులు సం ఘాల నాయకులు సంతాపం తెలిపారు.

● పోలీసు అధికారుల సంఘం శ్రద్ధాంజలి

నెల్లూరు(క్రైం) : ప్రపంచ స్థాయి వ్యక్తులలో ఒకరిగా నిలిచిన రామో జీరావు మృతికి ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. వేలాది మందికి ఉద్యోగ కల్పన చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపి, భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మహా మనిషి రామోజీరావు మరణం తీరని లోటుగా పేర్కొన్నారు.

జనసేన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వంలో భాగస్వామ్యమై జనసేన ఆశయాలను, పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలను ప్రతి జనసైనికుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపు కోసం పనిచేసిన ఉప్పుటూరు గ్రామం జనసైనికులు శనివారం నగరంలో గునుకుల కిషోర్‌ను కలిశారు. రూరల్ పరిధిలో అభివృద్ధికి సంబంధించిన ఏ విషయం అయినా శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి చేయించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్, శ్రీనివాసులు, పవన్, చైతన్య, పాల్గొన్నారు

● నిరుపేదలకు అన్నదానం

జనసేన పార్టీ అధినేత, ఆ పార్టీ అభ్యర్థులు భారీ విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ నాయకుడు, ఆంధ్ర రాష్ట్ర పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు పోతురాజు టోనీ బాబు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ నెల 9వ తేదీన రెడ్‌క్రాస్‌లో మెగా రక్తదాన శిబిరం, 10వ తేది బైక్‌ర్యాలీ నిర్వహిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాటూరి రాము, లాయర్ శీనయ్య, సుబ్బు, లాయర్ ఝాన్సి, శ్రీనివాసులు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ బోర్డు డైరెక్టర్‌గా డాక్టర్ బిందుమీనన్

● అపోలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్

నెల్లూరు(వైద్యం), జూన్ 8 : ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ బోర్డు డైరెక్టర్‌గా అపోలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్ ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని అపోలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. శనివారం అపోలో ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏకైక వ్యక్తిగా బ్రెయిన్ స్ట్రోక్ డైరెక్టర్‌గా డాక్టర్ బిందుమీనన్ ఎంపికయ్యారన్నారు. దీంతో పాటు అడ్వకసి లీడర్‌షిప్ ఫోరంలో సలహాదారులుగా కూడా ఎంపికయ్యారని చెప్పారు. డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ తనకు ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవం దక్కేందుకు అపోలో ఆసుపత్రి యాజమాన్యం ఎంతో సహకారం అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న సోమిరెడ్డి

వెంకటాచలం: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మను శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సోమిరెడ్డిని సత్కరించారు. శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని సోమిరెడ్డి ఆకాంక్షించారు.

రామోజీ మృతి పత్రికా రంగానికి తీరని లోటు



ముత్తుకూరు: రామోజీకి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



మనుబోలు : నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

ముత్తుకూరు, జూన్ 8 : 'ఈనాడు' వ్యవస్థాపకుడు రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని ముత్తుకూరు మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో రామోజీరావుకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు ప్రజలకు దినపత్రికను పరిచయంచేసి దగ్గర చేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. రామోజీరావు మృతి బాధాకరమని తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ సభ్యుడు బొనిగి శీనయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అక్షర యోధుడు రామోజీరావు : దీపావెంకట్

వెంకటాచలం: మీడియా రంగంలో తనదంటూ ప్రత్యేక పేజీని లిఖించుకున్న అక్షర యోధుడు, మీడియా దిగ్గజం, పద్మవిభూషణ్ రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ శనివారం ఒక ప్రకటనలో శ్రద్ధాంజలి ఘటించారు. రామోజీరావు మృతి బాధాకరమని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ అన్నారు.

●మనుబోలు: స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు శనివారం రామోజీరావుకు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్ రెడ్డి, జనసేన నాయకులు పవన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

●పొదలకూరు: పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కె సునీతారెడ్డి, స్కూల్ చీఫ్ అడ్వైజర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గా, డైరెక్టర్ చంద్రశేఖర్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

●కోవూరు: స్థానిక బజారు కూడలిలో శనివారం పలు ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటం వద్ద క్యాండిల్స్ వెలిగించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి సంతాపసూచికంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గాదిరాజు అశోక్ కుమార్, న్యాయవాద సంఘం కార్యదర్శి పూండ్ల స్టాలిన్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు గుంజి ఖాసిం, గౌడ సంఘం నాయకుడు దాసరి విజయకుమార్, టీడీపీ నాయకులు పిచ్చుక మధుసూదనరావు, ఆవుల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

●విడవలూరు: స్థానిక టీడీపీ శ్రేణులు శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు, నాయకులు బెజవాడ శ్రీనివాసులురెడ్డి, శ్రీహరి, ప్రకాశం, చెముకుల వేణు, తాతా సురేష్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

●బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం పలువురు టీడీపీ నాయకులు దివంగత రామోజీరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంవీ శేషయ్య, వింజం రామానాయుడు, వల్లూరు శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●సైదాపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వరిగొండ సురేంద్ర ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రామోజీరావు చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొల్లినేని కోటయ్య నాయుడు, కీర్తిపాటి రాజశేర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 8: జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతో విజయవంతం అయ్యాయని ఆలయ కార్యనిర్వహణాధికారి వి గిరికృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఆలయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలలో భక్తులకు సేవలందించిన దాతలు, అన్ని శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, అర్చకులు స్థానిక గ్రామ ప్రజలకు ఈఓ ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా వడాయతి ఉత్సవం

జొన్నవాడ ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత రోజు నిర్వహించే వడాయతి ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయ కుంభహారతి మండపంలో ఏర్పాటు చేసిన ఊయలలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ఊరేగించారు.

16న జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు

కోవూరు, జూన్ 8: నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఈనెల 16వ తేదీన నిర్వహించే జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సుకు ప్రజాతంత్ర వాదులందరూ హాజరుకావాల్సిందిగా సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య కోరారు. సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

ఘనంగా హనుమజ్జయంతి



వీరాంజనేయస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ముత్తుకూరు, జూన్ 8: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ముత్తుకూరులో వెలిసిన వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారు స్వర్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభించి రామనామ ఏకాహ దీక్షతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ధర్మకర్తలు చౌకచర్ల భాస్కర్ రెడ్డి, చౌకచర్ల శ్రీనివాసులురెడ్డి దంపతులు స్వామివారికి ప్రత్యేక పల్లకీసేవ నిర్వహించారు.

వెంకటాచలంలో పోలీసుల కవాతు

వెంకటాచలం, జూన్ 8: ఎలాంటి గొడవలు, వివాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం సాయంత్రం నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బలగాలు వెంకటాచలంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ రాజేష్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

ఆదివారం ప్రత్యేకం

పన్నికట్టు @ రామిరెడ్డి పాళెం

కంచి అనగానే మగువలకు గుర్తొచ్చేది అందమైన పట్టుచీరలు.ఇక్కడ తయారయ్యే పట్టు, బంగారు, వెండి, జరీ చీరలకు దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ . ఈ కంచిపట్టు చీరల తయారీ వెనుక నేతన్నల కష్టంతో పాటు పన్నికట్టు కళాకారుల సృజనాత్మకత కూడా దాగి వుంది.



పన్ని తయారీ

- ప్రధాని ప్రశంసలందుకున్న పన్నికట్టు కళాకారులు
- కంచి పట్టుచీరల తయారీలో 'పన్ని' ప్రధాన భూమిక





పన్ని తయారీకి ఉపయోగించే జొన్న దంటు, వెదురు పుల్లలు



సత్యవేడు, జూన్ 8 : కంచి పట్టుచీరల తయారీలో పన్ని అనే పరికరం ప్రధాన భూమిక పోషిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'పన్ని' లేనిదే కంచి పట్టు చీరల తయారీ కుదరదు. పొందూరు ఖాదీ తయారీలో 'వాలుగ చేప దవడ' పరికరం ఎంత ముఖ్యమో, కంచి పట్టుచీరల తయారీలో కూడా ఈ పన్ని అంతే ముఖ్యం. పట్టు వస్త్రాల తయారీలో నిలువు, అడ్డు పోగులను సరైన క్రమంలో అమర్చే పరికరం పేరే పన్ని. కంచి పట్టు చీరల తయారీకి అవసరమయ్యే 'పన్ని' మన రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లోనే తయారు చేస్తారు. ఒకటి నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు కాగా, రెండు మన జిల్లాలోని వరదయ్యపాళెం మండలంలోని రామిరెడ్డి పాళెం.ఈ రెండు ప్రాంతాల నుంచే కంచికి పన్ని సరఫరా అవుతోంది. జొన్నదంటు, వెదురు పుల్లలు చీల్చి తయారు చేసే ఈ పరికరాన్ని కంచి నేతన్నలకు సరఫరా చేస్తూ ఇక్కడి కళాకారులు జాతీయ ఖ్యాతి దక్కించుకున్నారు.బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఈ పన్నికట్టు కళను చూసి ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ కళాకారులను ప్రశంసించారు. వరదయ్యపాళెం మండలం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాలు ఈ పన్నికట్టు మీదనే ఆధారపడి బ్రతుకుతున్నాయి.పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఈ కళను బ్రతికించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేనేత కార్మికుల తరహాలో ప్రభుత్వాలు తమను ఆదరించక పోయినా నమ్ముకున్న ఈ వృత్తిని, అరుదైన ఈ కళను అంతరించి పోకుండా కాపాడుకుంటూ, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పన్ని తయారీ విధానం

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి జొన్న దంటు, బుచ్చినాయుడు కండ్రిగ మండలం పెళ్కూరు నుంచి వెదురు పుల్లలు సేకరించుకుని బాగా ఎండబెడతారు. ఎండిన జొన్నదంటును మూడు నుంచి, మూడున్నర ఇంచీల లెక్కన సుమారు మూడువేల పుల్లలను సన్నగా చీల్చుకుంటారు.వీటిని గూటంలో పేర్చి పదునైన చిన్నపాటి కత్తులతో గరుకుల్లేకుండా మృదుత్వం వచ్చే వరకు చివ్వుకుంటారు. అనంతరం బాగా ఎండిన వెదురు పుల్లలను ఒకటిన్నర సెంటీమీటర్ మందంతో నాలుగు దబ్బలుగా చీల్చుకుంటారు. చీల్చిన దబ్బల నుంచి పైన రెండు దబ్బలు, కింద రెండు దబ్బలను మూడు అంగుళాల వెడల్పు పెట్టి ఒక ప్రత్యేక పరికరంలో అమర్చుకుంటారు. ఈ వెదురు దబ్బల సందుల్లోంచి, చీల్చిన జొన్నదంటు పుల్లలను ఒక్కొక్కటిగా పేర్చుకుంటూ దారంతో కడుతూ ముడి వేస్తారు. ఇలా మూడువేల జొన్నదంటు పుల్లలను కట్టి పన్ని తయారు చేస్తారు. ఒక్క పన్ని తయారు చేయాలంటే సుమారు రెండు రోజులు పడుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఇంటిల్లిపాదీ సహనంతో పని చేయాల్సి ఉంటుంది. ఇంత చేసినా ఒక్క పన్ని విక్రయిస్తే వారికి దొరికేది రూ.వెయ్యికన్నా తక్కువే. అదే వారి కూలి, అదే లాభం కూడా.

ప్రధాని ప్రశంసలు

ఆజాదీకా అమృత మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేత రంగంలో దేశవ్యాప్తంగా నిష్ణాతులైన కార్మికులను కేంద్ర ప్రభుత్వం సన్మానించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత ఏడాది ఆగస్టు 7వ తేదీన జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర ప్రభుత్వం రామిరెడ్డిపాళెం పన్ని కళాకారులను ఆహ్వానించి గౌరవించింది. గ్రామానికి చెందిన పన్ని కళాకారులు షేక్ బషీర్, షేక్ వహీద్ ఢిల్లీలోని ప్రగతి భవన్‌లో జరిగిన చేనేత ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి పన్ని తయారీ గురించి ప్రత్యక్షంగా వివరించి మన్ననలందుకున్నారు.

అంతరించిపోతున్న అరుదైన కళ

పన్ని కళాకారులను ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో పాటు శ్రమకు తగిన ప్రతిఫలం లేకపోవడంతో ప్రస్తుతం ఈ వృత్తిలోకి కొత్తగా ఎవరూ రావడం లేదు. పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా అబ్బిన ఈ వృత్తిపై ఉన్న మమకారంతో కొంతమంది వదులుకోలేక కొనసాగుతున్నారు. ప్రస్తుతం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాల వారు మాత్రమే ఈ వృత్తిలో వున్నారు.అంతరించి పోతున్న ఈ అరుదైన కళను ప్రభుత్వం ప్రోత్సహించి, కాపాడాల్సిన అవసరం ఉంది.

ఇంటిల్లిపాదీ పనిచేస్తాం



ఇంటిల్లిపాదీ రెండు రోజులు పనిచేస్తే ఒక పన్ని తయారవుతుంది.దాన్ని విక్రయిస్తే ఖర్చులు పోనూ రూ.వెయ్యి కూడా మిగలడం లేదు. అరుదైన ఈ కళ అంతరించిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చేనేత రంగానికి అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి.

- ఎస్‌కే బాషా

ప్రభుత్వం ఆదుకోవాలి



చేనేత మగ్గాలకు పన్ని ఊపిరిలాంటిది. పన్ని లేనిదే పట్టుచీరలు నాణ్యతగా తయారీ కాదు. తరతరాలుగా మేము పన్ని తయారీలోనే బ్రతుకుతున్నాం. ఇది చాలా ఓర్పుతో కూడుకున్న పని.కూర్చున్న చోటు నుంచి కదలకుండా గంటలపాటు ఉండాల్సి వస్తుంది. ఇది పన్ని కళాకారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొద్ది కాలానికే శరీరం పటుత్వం కోల్పోతుంది. నేత కార్మికులను ఆదుకున్నట్లే మమ్మల్ని కూడా ప్రభుత్వం ఆదరించాలి. వారిలాగే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నేత కార్మికులకు ఇచ్చినట్లే పింఛన్ కూడా మంజూరు చేయాలి.

- షేక్ బషీర్ సాహెబ్



రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

రూ.21.53 లక్షల దుర్వినియోగంతో పాటు అవినీతి ఆరోపణలు

అవినీతికి కేరాఫ్ అడ్రస్

చాలాకాలంగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డిపై విపరీతమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగాభూముల మార్కెట్ రేట్లు అడ్డదిడ్డంగా పెంచేయడంతో దుమారం రేగింది. దీంతోపాటు అవినీతి ఆరోపణలపై ఆయన్ను సస్పెండ్ చేశారు.ఆయన స్థానంలో వచ్చిన శోభారాణి స్టాంపు వెండర్ల చేత రిజిస్ట్రేషన్ సమయంలో అంకణానికి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారన్న ప్రచారం జరిగింది. దీన్ని అవకాశంగా భావించిన స్టాంపు వెండర్లు ఏకంగా అంకణానికి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు సబ్ రిజిస్ట్రార్‌కు కట్టాలని చెబుతూ వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి.ప్రభుత్వ భూములకు సైతం పక్కనున్న పట్టాదారుసర్వే నెంబరు వేసి రిజిస్ట్రేషన్ చేసేశారన్న ఆరోపణలున్నాయి.

తిరుపతి(నేరవిభాగం)/రేణిగుంట, జూన్ 8 : తీవ్రమైన అవినీతి ఆరోపణలతో పాటు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన దాదాపు రూ 21.53 లక్షల దుర్వినియోగం కేసులో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ శోభారాణి సస్పెండయ్యారు.జిల్లా స్టాంపుల రిజిస్ట్రేషన్ డీఐజీ శ్రీనివాసులరెడ్డి శనివారం రాత్రి ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భూముల రిజిస్ట్రేషన్లు, ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్లు, వివిధ రకాల చలానాలు, సర్టిఫైడ్ కాపీల ద్వారా రోజూ వేలాది రూపాయలు వసూలవుతుంది. ఈ నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి.అయితే సుమారు రెండేళ్ళుగా స్టాంపుల విక్రయం, ఈసీలు, నకళ్ల ద్వారా వచ్చిన దాదాపు రూ 21.53 లక్షలు బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు సబ్ రిజిస్ట్రార్ శోభారాణిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై చిత్తూరు డీఐజీ గిరిబాబు విచారణకు ఆదేశించారు.పిచ్చాటూరు, సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్లు సుధాకర్, సుమలత విచారణ జరిపి రెండు నెలల క్రితం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనిపై అప్పట్లోనే జూనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌ను సస్పెండ్ చేశారు. విచారణలో శోభారాణి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లుగా తేలడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు వేస్తూ చిత్తూరు డీఐజీ గిరిబాబు శనివారం ఆదేశాలు జారీ చేసారు.వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమీప బంధువని చెప్పుకుంటూ శోభారాణి అనేక వివాదాస్పద భూములను రిజిస్టర్ చేసి డాక్యుమెంట్ రైటర్స్ చేత కోట్లాది రూపాయలు వసూలు చేయించినట్లు ఆరోపణలున్నాయి. గతంలో కడప జిల్లా పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన కాలంలోనూ ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేసి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్లు ఆరోపణలు వున్నాయి.2022లో ఆమె రేణిగుంటకు బదిలీపై వచ్చారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి వివాదాస్పద భూములకు సంబంధించి వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.



మీడియా రంగంలో చెరగని ముద్ర

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి నేపథ్యంలో చిల్లకూరు మండలం ఏరూరుకు చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ శనివారం సముద్రతీరంలో ఆయన సైకత శిల్పాన్ని రూపొందించి నివాళులర్పించారు.మీడియా, సినీరంగాల్లో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న రామోజీరావు పలు సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పించారన్నారు.

- చిల్లకూరు

తిరుమల ఏఎస్పీపై బదిలీ వేటు



- అచ్చెన్నాయుడి అరెస్టు వ్యవహారంలో కీలకపాత్ర

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఏఎస్పీ శివరామిరెడ్డి శనివారం బదిలీ వేటుకు గురయ్యారు. నేరుగా ఆయన్ను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజుకు సూచించారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిని మూడేళ్ల క్రితం అరెస్టు చేసిన సమయంలో శివరామిరెడ్డి కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేసేవారు.అప్పట్లో అనారోగ్యంతో వున్న అచ్చెన్నాయుడి పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారన్న చెడ్డపేరు మూటగట్టుకోవడం గుర్తుండే వుంటుంది.

నిలకడగా నిమ్మ ధరలు



గూడూరు అర్బన్, జూన్ 8: గూడూరు నిమ్మ మార్కెట్‌లో కొద్దిరోజులుగా నిమ్మకాయల కొనుగోళ్లు నిలకడగా సాగుతుండడంపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం కూడా కిలో నిమ్మకాయల ధర రూ. 90 వరకూ పలికింది. లూజు బస్తా రూ. 6,800, టిక్కీ బస్తా రూ.4,250 పలికింది. కనిష్ఠంగా కిలో రూ.60 పలికింది. గతేడాది జూన్‌లో కిలో రూ.10 నుంచి రూ.30 వరకు పలకగా ఈ సారి మూడు రెట్లు అదనంగా ధర, విక్రయాలు పెరగడంతో నిమ్మ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రుతుపవనాల ఆగమనంతో వర్షాలు కురుస్తున్నా నిమ్మ ధరలు స్థిరంగా ఉండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గూడూరు, జూన్ 8: గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, పలు సంస్థల ప్రతినిధులు, యూనియన్ల నాయకులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని వర్గాల కృషితోనే తాను విజయం సాధించానన్నారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

యువతకు అత్యధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే విజయశ్రీ



ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న తెలుగుయువత నాయకులు

నాయుడుపేట, జూన్ 8: దేశ బంగారు భవిష్యత్తుకు వెన్నెముకలాంటి యువతకు కూటమి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో శనివారం తెలుగుయువత నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలంటే యువతకు ఉపాధి అవసరమన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను దగా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్, నాయకులు జి.సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గోపాల్, సాహిద్, సందీప్, సాయికిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణించేందుకు నగదు ప్రోత్సాహం



గూడూరు, జూన్ 8: పేద బలిజ విద్యార్థినులు చదువుల్లో రాణించేందుకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు బలిజ మహిళా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు ఎస్.సులక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని గమళ్లపాళెంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రతిభచాటిన దుర్గాదేవికకు సంఘం ఆధ్వర్యంలో ఏ.సురేష్ జ్ఞాపకార్థం రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పద్మావతి, సరోజనమ్మ, సువర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



గూడూరు అర్బన్, జూన్ 8: రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పాశం సునీల్‌కుమార్ విజయం సాధించాలని 28వ వార్డు టీడీపీ నాయకులు ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. కూటమి విజయం సాధించడంతోపాటు చంద్రబాబు, సునీల్‌కుమార్ గెలవడంతో శనివారం ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ఇశ్రాయిల్ కుమార్, రమేష్‌కుమార్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కోట, జూన్ 8: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. సీతారామ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో రమణారెడ్డి, సరోజనమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించి ఈ కల్యాణాన్ని తంతును పూర్తి చేయించారు. మొదట ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణాన్ని వేదపండితులు అనంతాచార్యులు, నరేష్‌శర్మ ఆగమోక్తంగా నిర్వహించారు. లోకకల్యాణం కోసం చేస్తున్న ఈ స్వామివారి కల్యాణంలో కోట పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్యామసుందరపురంలో అభయాంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాయిబాబా, ధర్మకర్తలు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ, శరవణ, రాధ, రాజేశ్వరి, గంధం శ్రీనివాసులు, నిర్మలమ్మ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఎన్నికలు ఏకగ్రీవం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

కోట, జూన్ 8: పట్టణంలోని షాదీ మందిర్‌లో శనివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ గూడూరు డివిజన్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 7 మండలాలకు చెందిన ఉద్యోగులు తమ యూనియన్ నేతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. గూడూరు డివిజన్ యూనియన్ అధ్యక్షుడిగా బి.రత్నయ్య, కార్యదర్శిగా షాదీక్‌బాషా, గౌరవాధ్యక్షుడిగా మునికృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.మాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా డివిజనల్ జనరల్ సెక్రటరీగా ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధీర్‌కుమార్, కోశాధికారిగా జనార్దన్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసింది.

నేడు హనుమాన్ శోభాయాత్ర



వెంకటగిరి టౌన్, జూన్ 8: హనుమాన్ శోభాయాత్ర ప్రతి హిందువు విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు వి.భాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 1న నిర్వహించాల్సిన హనుమాన్ శోభాయాత్ర ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిర్వహించలేక పోయామన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానం నుంచి పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. మల్లికార్జున్, సుధాకర్, పురుషోత్తం, నర్రారవి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈసీలో సీట్ల భర్తీ

వెంకటగిరి, జూన్ 8 : వెంకటగిరి బాలుర ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంఈసీ గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారదాబాయి చౌదరి పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీ సీఈసీ 2024 ఏడాది ప్రవేశ పరీక్షలకు హాజరై ప్రస్తుతం సీట్లు లభించని వారితో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మొదట వచ్చిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ నెల 13వ తేదీ భర్తీ గడువు ముగుస్తుందన్నారు. వివరాలకు నెం.5712625075లో సంప్రదించాలన్నారు.

వివాదాలకు దూరంగా ఉందాం

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల



ఆలయం వద్ద ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 8: నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివాదాలకు దూరంగా ఉండాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నేపథ్యంలో విజయగణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన అరాచకాలు, అన్యాయాలను ప్రతిఘటిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు ఓటు ద్వారా వైసీపీని పాతాళానికి తొక్కేశారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పాతరవేసి... ప్రకృతి వనరులను దోచేసిన దోపిడీదారులకు వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. ప్రజలు ప్రశాంతత కోరుకుంటున్నారని అందుకు కూటమి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తుందన్నారు. అనంతరం బలిజ సంఘ నాయకుడు కుబేరు మణి ఆధ్వర్యంలో ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, దాము, భాస్కర్‌రెడ్డి, బాబు, చిట్టి, ధనంజయ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ పతి, బాబు, మస్తాన్, సుబ్బారావు, నారాయణ, రవి, చక్రపాణి తదితరులు ఉన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి





రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు - రామోజీరావుకు కురుగొండ్ల నివాళి

నాయుడుపేట టౌన్, జూన్ 8: పత్రికారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసిన అక్షరయోధుడు రామోజీరావు అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావుకు నివాళి అర్పించారు.

వెంకటగిరి: రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు మహోన్నత వ్యక్తి అని, ఆయన మరణం తనని దిగ్భ్రాంతికి గురి చేసిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కలమే ఆయుధంగా సమాజంలో చైతన్యం నింపేందుకు రామోజీరావు అహర్నిశలు శ్రమించారన్నారు.

గూడూరు: రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గూడూరు ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి అర్పించారు. టీడీపీ కార్యాలయంలో రామోజీరావుకు నివాళి అర్పించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని కచ్చేరివీధిలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి కార్యాలయంలో రామోజీ చిత్రపటం ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కోట: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రామోజీరావుకు టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద శనివారం కోటకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తడ: రామోజీరావుకు టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళి అర్పించారు. శనివారం స్థానిక బస్టాండ్ కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.మురళీరెడ్డి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేషన్ పంపిణీలో మాటలకే పరిమితమైన వైసీపీ



రేషన్ దుకాణ ప్రారంభోత్సవంలో నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 8: రేషన్ పంపిణీలో వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో శనివారం 8వ రేషన్ దుకాణ పునఃప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2 రూపాయలకే బియ్యాన్ని అందజేసి పేదలకు పట్టెడన్నం పెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సౌకర్యంగా రోజులో ఎప్పుడు వచ్చినా సరుకులను అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటికే సరుకులను అందిస్తామని చెప్పి వాహనాల ద్వారా వీధుల్లో నిలబెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టి సరుకులను అందజేశారని ఆయన విమర్శించారు. టీడీపీ సీనియర్ నేత ఎస్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎక్కడైనా రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం జరిగితే తక్షణమే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కూలి పనులకు వెళ్లే వారు రేషన్ సరుకులను తీసుకోలేక నానా అవస్థలు పడ్డారని అలాంటి పరిస్థితులు ఇక ఉండవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పసల గంగాప్రసాద్, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, బాబు, మస్తాన్, రామారావు, చక్రపాణి, ధనంజయ, శశి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

15 సవర్ల బంగారు నగల చోరీ



చిందరవందరగా ఉన్న వస్తువులు

నాయుడుపేట టౌన్, జూన్ 12: మండలంలోని అయ్యప్ప రెడ్డి పంచాయతీలో ఉన్న జగనన్న కాలనీలో 15 సవర్ల బంగారు చోరీ జరిగినట్లు బాధితుడు అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనిల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చెన్నైలో విధులు నిర్వహిస్తూ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నాడు. రెండు నెలల క్రితం భార్య ప్రసవానికి పుట్టింటికి వెళ్లడంతో ఇంటికి తాళాలు వేసుకొని చెన్నై వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటికి సమీపంలో ఉన్న స్నేహితులు ఫోన్ చేసి ఇంటి తాళాలు ధ్వంసమైనట్లు గుర్తించి సమాచారం అందించారు. నాయుడుపేటకు చేరుకొని ఇంటికి వెళ్లి పరిశీలించిన అనిల్... ఓ బాక్సును పరిశీలించగా అందులో నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. 15 సవర్ల బంగారు, ల్యాప్‌టాప్ చోరీ జరిగినట్లు పేర్కొన్నాడు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే నాయుడుపేట పట్టణానికి సమీపంలో ఉన్న తుమ్మూరు ఇందిరా కాలనీలో పాత్రలు చోరీ జరిగినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి 11 గంట లకు ఇంటికి వెళ్లాడు. ఇంటికి వేసి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న సామాన్లు చోరీ జరిగినట్లు గుర్తించి శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రత

తిరుమలలో విధులంటే స్వామికి సేవ చేయడమే: ఎస్పీ

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రతను కల్పించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. తిరుమలలోని పోలీస్ కాంప్లెక్స్‌ను శనివారం తనిఖీ చేశారు. తిరుమల వన్‌టౌన్, టూటౌన్, క్రైం స్టేషన్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పోలీసులు అధికారులతో సమీక్షించారు. తిరుమలలో శాంతి భద్రతలు, క్రౌడ్ కంట్రోల్ గురించి తెలుసుకున్నారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. హుందాగా వ్యవహరిస్తూ జిల్లా పోలీసుల ఖ్యాతిని ప్రపంచస్థాయికి పెంచాలన్నారు. తిరుమలలో విధులు నిర్వహించడమంటే శ్రీవారికి సేవ చేయడమే అన్నారు. చిన్నపిల్లలను అపహరించే వారిపై, ఆభరణాలు, వస్తువులను దొంగిలించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలిచ్చారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో తరచూ తనిఖీలు చేపట్టి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలన్నారు. ఉపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భవన నిర్మాణ కార్మికుల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనుమానితులు, పాత నేరస్తులను తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంట్రావు, శివరామిరెడ్డి, డీఎస్పీలు వెంకటాద్రి, శ్రీనివాసాచారి, సీఐలు విజయ్‌కుమార్, సత్యనారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,830 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,810 మంది తలనీలాలు సమర్పించారు.

తుడా ఛైర్మన్ రాజీనామా

తిరుపతి రూరల్, జూన్ 8: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తుడా ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుడా ఛైర్మన్‌గా అభివృద్ధి పనులు చేయడానికి సహకరించిన అన్ని పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడాదికాలంగా తన వెంట తిరిగిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీకి అభినందనలు తెలిపారు.

రేపటినుంచి ఎస్వీయూలో తరగతుల ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 8: ఎస్వీయూనివర్సిటీలో సోమవారం నుంచి పీజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆదివారంతో వేసవి సెలవులు ముగియనున్నాయి. దీంతో పీజీ 4, 2వ సెమిస్టర్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు.

అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ



గమళ్లపాళెం, కటకరాజవీధి, రజక వీధులోని కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

గూడూరు, జూన్ 8: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో పట్టణంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో డ్రైనేజీ కాలువలు దుస్థితికి చేరుకున్నాయని స్థానికులు వాపోతున్నారు. పలుచోట్ల కాలువలు పూడిపోవడం, మరికొన్ని ధ్వంసం కావడం, కొన్ని ప్రాంతాల్లో నిర్మించకపోవడం, కొన్ని ప్రాంతాల్లో నిర్మించినా నిర్వహణ చేపట్టకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. గమళ్లపాళెం, అరుంధతీయ పాళెం, శాంతినగర్, జనార్దన రెడ్డికాలనీ, ధూర్జటినగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కదలక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కటకరాజవీధిలో కాలువలు ధ్వంసం కావడం, ధూర్జటినగర్ సమీపంలోని రజకవీధిలో ఓ వైపు కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇదే ప్రాంతంలో మరో వైపు కాలువ నిర్మాణం చేపట్టినా నిర్వహణ లేకపోవడంతో కాలువలలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. పట్టణంలోని పలు వార్డుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వాన నీరు మురుగుతో రోడ్లపై ప్రవహిస్తుండడంతో రాకపోకలకు పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు పట్టణంలో మురుగునీటి వ్యవస్థను అభివృద్ధిపరచాలని కోరుతున్నారు.

గూడూరులో కుండపోత



కోనేటిమిట్టలో రోడ్డుపై ప్రహిస్తున్న వర్షపునీరు

గూడూరు, జూన్ 8: పట్టణంలో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల నుంచి గంటపాటు జోరుగా వర్షం పడింది. దీంతో కోనేటిమిట్ట, ఆసుపత్రిరోడ్డు, కుమ్మరవీధి, త్యాగరాజవీధి, ఐసీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. వర్షం కురవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిమ్మరైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్‌జెండా ఊరేగింపు



గూడూరు అర్బన్, జూన్ 8: పట్టణంలోని దర్గావీధిలో హజరత్ సయ్యద్ హషీం హుసైని జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో శుక్రవారం రాత్రి నిషాన్‌జెండా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా కమిటీ గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి జెండాను దర్గా వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మగ్దూం, షానవాజ్, సందానీ, గౌస్, షబ్బీర్, యాస్దానీ, నయ్యూం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూన్ 8: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు జరిపారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి స్వామిఅమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

పేరంటాలమ్మకు మంగళసూత్రం వితరణ

సూళ్లూరుపేట, జూన్ 8: మండల పరిధిలోని కోటపోలూరులో కొలువుదీరిన నారాయణ పేరంటాలమ్మకు శనివారం 17 గ్రాముల బంగారు మంగళ సూత్రాన్ని స్టేట్‌బ్యాంక్ ఉద్యోగిని ఐఆర్.హేమలత అందజేశారు. పుత్తూరు స్టేట్‌బ్యాంక్‌లో పనిచేసే హేమలత కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుని పేరంటాలమ్మకు రూ.1.15 లక్షల విలువైన మంగళసూత్రాన్ని అందించారు.

ప్రజా తీర్పును స్వాగతిస్తున్నా

వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

గూడూరు, జూన్ 8: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైనా మేరిగ మురళీధర్ అన్నారు. శనివారం పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఆయన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... ఈ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్నారని, ఫలితాలు బాధను కల్గించినా ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీగా నియోజకవర్గంలోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగితే న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు. తిరుపతి ఎంపీగా వైసీపీకి చెందిన గురుమూర్తి విజయం సాధించడం సంతృప్తినిచ్చిందన్నారు. బి.శ్రీనివాసులు, మగ్థుం మురళి, రాజేష్, నారాయణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ రాజీనామా



దొంతు శారద

వెంకటగిరి, జూన్ 8 : నెల్లూరు జిల్లా గ్రంథాలయ అభివృద్ధి ఛైర్‌పర్సన్ దొంతు శారద శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామ పత్రాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యా(గ్రంథాలయాలు) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపారు. తన రాజీనామ పత్రాని ఆమోదించాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడబోతున్న తరుణంలో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ లేఖలో ఆమె పేర్కొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్ రాజీనామా

నాయుడుపేట, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తూ... నాయుడుపేట మండల వైసీపీ కన్వీనర్‌గా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో నాయుడుపేట మండలంలో వైసీపీకి 5వేల పైచిలుకు మెజార్టీ వచ్చిందని, 2024 ఎన్నికల్లో రూరల్ మండలంలో టీడీపీకి 1800 మెజార్టీ రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మెయిల్ ద్వారా రాజీనామా చేస్తున్నట్లు సమాచారం అందించానన్నారు. వైసీపీ అధిష్ఠానం, మాజీ ఎమ్మెల్యే కిలివేటి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, కాకాణి ఆదేశాలు శిరసావహిస్తామని తెలిపారు.

దాడి కేసులో నిందితులకు రిమాండ్

పెళ్లకూరు, జూన్ 8: చిల్లకూరులో జరిగిన దాడి కేసులో ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితోపాటు ఎనిమిదిమంది నిందితులకు సూళ్లూరుపేట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. అనంతరం వారిని నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. శుక్రవారం రాత్రి అరెస్టు చేసిన సత్యనారాయణరెడ్డిని శనివారం రాత్రి పోలీసుల బందోబస్తు నడుమ నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. పరస్పర దాడులకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వివాదస్పదంగా ఉన్న చిల్లకూరు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలకు దిగితే జైలుపాలు కాక తప్పదని పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,830 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,810 మంది తలనీలాలు సమర్పించారు.